గడువులోగా పనులు పూర్తిచేస్తాం

కలెక్టర్ అరుణ్ బాబు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా అభివద్ధి పనులు పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శనివారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ పాల్గొన్నారు. ఈ సమీక్షలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని జిల్లాలో తగిన చర్యలు తీసుకోవాలని జవహర్ రెడ్డి ఆదేశించారు. రెవెన్యూ, రీ సర్వే, జాతీయ రహదారులకు భూ సేకరణ, భూ కేటాయింపులు, వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, డైయిరీ అభివద్ధి, గహ నిర్మాణాలు, ప్రాధాన్యత భవన నిర్మాణాలు తదితర అంశాలపై సిఎస్ సమక్షించారు. అభివద్ధి పనులు ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు వేగవంతంగా పనులు జరుగుతున్నాయని గడువులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు.

సం'కుల'సమరం..!

ఎన్నికలు సమీస్తున్న తరుణంలో కులాల సమరం మొదలైంది. వచ్చే ఎన్నికల్లో తమ కులానికి ప్రాధాన్యత కల్పించాలన్న డిమాండ్లను వినిపిస్తున్నాయి. అయితే వీటి వెనుక ఆయా రాజకీయపార్టీల నేతలూ ఉంటుండటం గమనార్హం. మొత్తంగా ఆ కులాల మద్దతును కూడగట్టుకునేందుకు ప్రధాన రాజకీయపార్టీలు ప్రయత్నిస్తున్నాయి. తాము అధిక ప్రాధాన్యతనిచ్చామంటే.. తామూ ఇచ్చామంటూ చెప్పకుని ఆ కులం మద్దతు పొందే ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం.

◆ ఎన్నికల వేళ కుల సంఘాల కోలాహలం ◆ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలో కురుబసంఘం గుడికట్ల సంబరాల పేరుతో పెద్దఎత్తున కుల సమీకరణ చేపట్టారు. భారీగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. 250 గుడికట్లు కూడా వచ్చాయి. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయపార్టీల నుంచి నేతలు పాల్గొని ఆ కులంలో తమకు మద్దతు ఉన్నట్టు చాటి చెప్పే ప్రయత్నం చేశారు. ఇందులోనూ గోరంట్ల మాధవ్, బికె.పార్థసారధిల మధ్య వివాదం చోటు చేసుకుంది. రాజకీయాలకు అతీతమైన ఈ సభలో వివాదం సరైంది కాదని కుల పెద్దలు సర్దిజెప్పాల్సి వచ్చింది. ఇదే సమయంలో బోయ సామాజిక తరగతికి ప్రాధాన్యత కల్పించాలన్న డిమాండ్ వినిస్తోంది. ప్రధానంగా తెలుగుదేశం పార్టీలో సత్యసాయి జిల్లాలో బోయలకు ప్రాధాన్యత లేదన్న అభిప్రాయాన్ని ఆ కుల సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు. 1980 దశకంలో గంగాధర్‌కు హిందూపురం ఎంపీగా అవకాశం ఇచ్చారు. ఆ తరువాత ఎవ్వరికీ తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యతను కల్పించలేదన్న వాదనలను బోయలు వినిపిస్తున్నారు. ఆ పార్టీ ముఖ్య నేతల వద్ద కూడా ఈ అంశాన్ని లేవనెత్తినట్టు చర్చ నడుస్తోంది. వైసిపి మాత్రం రెండు బోయలు, కురబలు ఇద్దరికీ అధిక ప్రాధాన్యతను కల్పించామని చెబుతున్నారు. వడ్డేర్లు, యాదవలు ఇతర కుల సంఘాలు తమకు తగిన ప్రాధాన్యతను కల్పించలేదని చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు కులాలకు అసెంబ్లీగాని, పార్లమెంటు స్థానాలుగానీ కేటాయించ లేదంటున్నారు. వచ్చే ఎన్నికల్లో తమ సామాజిక తరగతులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్‌ను వినిపిస్తున్నాయి. ఇక మైనార్టీలు, బలిజ సామాజిక తరగతికి చెందిన వారు కూడా తమకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ ముందుకు తెస్తున్నారు. గత ఎన్నికల్లో ఎప్పుడు ఏ సామాజిక తరగతికి

ప్రాధాన్యతలు ఏ విధంగా కల్పించారన్న బేరీజులు సైతం వేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రధాన పార్టీలు కొన్ని మార్పులతోనే టిక్కెట్లు కేటాయించే అవకాశాలున్నాయన్న చర్చ కూడా నడుస్తోంది. ఇలా ఎన్నికలకు ముందు కులాల కుంపట్లు మొదలయ్యాయి. ఈ ఎన్నికల సమయంలోనూ అభివృద్ధి, జిల్లా సమస్యల కంటే ఈ అంశాలు ముందుకు రావడం గమనార్హం. వామపక్షాలు అందులోనూ సిపిఎం జిల్లా సమగ్రాభివృద్ధిని ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. మేధావులతో సదస్సులు నిర్వహించారు. అదే విధంగా బస్సు యాత్ర, స్కూటర్ యాత్రలను చేపట్టింది. ఇందులో అభివృద్ధి ప్రధాన అజెండాగా ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేసింది.

మత్తుపదార్థాల నియంత్రణకు చర్యలు : డిఆర్‌ఒ

సమావేశంలో పాల్గొన్న డిఆర్‌ఒ, అడిషనల్ ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో మత్తు పదార్థాలను పూర్తిగా నియంత్రించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని డిఆర్‌ఒ కొండయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అడిషనల్ ఎస్పీ విష్ణుతో కలిసి మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని డిఆర్‌ఒ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా నాలుగో శనివారం డ్రగ్స్ నియంత్రణపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించిన కమిటీలు చురుగ్గా పని చేయాలన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల గ్రామాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలో మత్తు పదార్థాల నివారణపై పూర్తి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు వెంటనే ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.రవికుమార్, అర్బన్ సిఐ కొండారెడ్డి, హర్ష, డిఅండ్‌హెచ్‌ఒ ఎస్‌వి.కృష్ణారెడ్డి, డిసిహెచ్‌ఒ తిప్పేనాయక్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, డీఈఓ మీనాక్షితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా తయారీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా తయారీలో నిష్పక్షపాతంగా వ్యవహరించి జాబితాను తయారు చేయాలని బూత్‌లెవల్ అధికారులను ఆర్డీవో కెఎస్.భాగ్యరేఖ ఆదేశించారు. ఓటరు జాబితాపై శనివారం తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు సి.కరుణాకర్, బుక్కపట్నం, దేవేంద్ర నాయక్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ భూపాల్, డిఎఇ జిలాని, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు శ్రీకందే నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 1-1-24వ తేదీ నాటికి 18 సంవత్సరాలు వయసున్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు వారికి సంబంధించి బూత్‌స్థాయి ఏజెంట్‌లను నియమించుకోవాలన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయించేలా అధికారులందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నుంచి రంగారెడ్డి, టీడీపీ నుంచి మాల మనోహర్, విజయకుమార్, బిజెపి నుంచి యస్.విజయభాస్కర్ రెడ్డి, యస్.రామాంజినేయులు, సిపిఎం నుంచి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కెయు విసి బాధ్యతల స్వీకరణ

విసి సుధాకర్‌ను కలిసిన ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా చింతా సుధాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ మాట్లాడుతూ ఎస్‌కెయులో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించి విద్యార్థుల విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గిరి, శివ, బీమేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే పివి.సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో భాగంగా మున్సిపాల్టీలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయించాలని ఎమ్మెల్యే పివి.సిద్ధారెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఎమినిటీ సెక్రెటరీలు, ప్లానింగ్ సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి మున్సిపాల్టీలో ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇప్పటివరకు పనులు ప్రారంభం కానీ వాటికి సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిలో అలసత్వం చూపే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్మాణాలకు సంబంధించి బిల్లులను కూడా ఎప్పటికప్పుడు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, ఛైర్‌పర్సన్ నజుమున్నీసాతో పాటుపలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కెంపెగౌడ హనుమయ్య జయంతి వేడుకలు

అమరాపురం : మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామంలో కుంచిటి ఒక్కలిగ కెంపెగౌడ హనుమయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఒక్కరిగ కార్పొరేషన్ డైరెక్టర్ నళిని రంగయ్యగౌడ్, రొళ్ల జడ్పిటిసి అనంతరాజు పాల్గొన్నారు. భక్తులు కలశం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి గిరిజమ్మ ఈరన్న, హల్కూరు కాంతరాజు, గౌడనకుంట వీరకేతప్ప, మద్దనకుంట ఎంపిటిసి హనుమంతరాయ, హల్కూరు సురేష్, ఎంపిటిసి నారాయణగౌడ, పాండురంగప్ప, గాళీదానేగౌడ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఆర్ఎంకు విశేష స్పందన

పుట్టపర్తి క్రైమ్ : జిల్లా ప్రజా రవాణా అధికారి టి.మధుసూదన్ శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో నిర్వహించిన 'డయల్ యువర్ ఆర్ఎం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలువురు ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు చేశారు. ప్రయాణికుల విన్నపం మేరకు అనంతపురం నుంచి పుట్టపర్తికి వెంటనే కొత్త బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పలుప్రాంతాల నుంచి అందిన ప్రయాణికుల వినతుల మేరకు బస్సు సర్వీసులు నడుపుతామని ఆర్ఎం తెలిపారు.

వైసిపి పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

ప్రజాశక్తి-బుక్కపట్నం

వైసిపి పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని ఆదర్శ విద్యాసంస్థల అధినేత పెద్దరాసు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుక్కపట్నంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. కేంద్రీయ విద్యా విధానం, విలీనం పేరుతో 8 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసేశారని మండిపడ్డారు. మెగా డీఎస్సీ పేరిట నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటం ఆడారన్నారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే జిఒలు తీసుకొచ్చి ప్రయివేట్ కాలేజీలు, పాఠశాలలు మూతపడేలా చేస్తున్నారన్నారు. కళాశాలల యజమానులను బెదిరిస్తూ జె టాక్స్ వసూలు చేస్తున్నారన్నారు. 2019-20 విద్యా సంవత్సరం బకాయిలు చెల్లించామని ప్రగల్భాలు పలుకుతూ విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి విద్యార్థులు, నిరుద్యోగ యువతను రోడ్ల పాలు చేశారని విమర్శించారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి

గోరంట్ల ప్రభుత్వాసుపత్రి వద్ద బాధితకుటుంబ సభ్యుల ధర్నా

ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

ప్రజాశక్తి-గోరంట్ల

గోరంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు రోజుల క్రితం ప్రసవం కోసం వచ్చిన ఓ మహిళ కాన్పు అనంతరం మరణించింది. మగబిడ్డకు జన్మనించిన ఆమె ఆ తరువాత తీవ్ర రక్తస్రావంతో మరణించింది. వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఆమె మృతి చెందిదంటూ బంధువులు ఆసుపత్రి ఎదుట శనివారం ఉదయం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బాధితకుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గోరంట్ల పట్టణం 6వ వార్డుకు చెందిన షాహిద్ భార్య జబినా(31) 3వ కాన్పు నిమిత్తం ఈ నెల 17వ తేదీన గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ఆమె మగబిడ్డకు జన్మనించారు. ప్రసవం అయిన కొద్దిసేపటి తర్వాత తీవ్ర రక్తస్రావంతో ఆమె ఇబ్బంది పడ్డారు. దీనిపై అక్కడున్న ఆమె బంధువులు వైద్యులకు తెలిపారు. దీనిపై వైద్యులు సరైన రీతిలో స్పందించలేదు. మహిళ పరిస్థితి విషమం కావడంతో రాత్రి 10 గంటల సమయంలో వైద్యులు మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని రెఫర్ చేశారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను హిందూపురానికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు సమస్య తీవ్రంగా ఉందని మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతానికి వెళ్లాలని సలహా ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు బెంగుళూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 23న మహిళ మరణించారు. మహిళకు కాన్పు అయిన వెంటనే రక్తస్రావం కాకుండా వైద్యులు మెరుగైన వైద్యం అందించి ఉంటే ఇలా జరిగి ఉండేది కాదంటూ అక్కడి వైద్యులు వారికి తెలిపారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు గోరంట్ల వైద్యులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆసుపత్రి ఎదుట ఆందోళన

వైద్యుల నిర్లక్ష్యం వల్లనే మహిళ మృతి చెందిందని బాధితురాలి కుటుంబ సభ్యులు శనివారం ఉదయం గోరంట్ల ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వీరికి టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ వైద్యం అందక బాలింత మృతి చెందడం అంత్య బాధాకరమైన విషయం అన్నారు. సరైన సమయంలో సక్రంగా వైద్యం అందించి ఉంటే మహిళ మరణించి ఉండేది కాదన్నారు. ఇందుకు ఆసపత్రి వైద్యులే బాధ్యత వహించాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. వైద్య చికిత్సలు అందించకుండా నిర్లక్ష్యం చేసిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి వైద్యులు ఆందోళనకారులతో మాట్లాడుతూ తాము అన్ని విధాలా మహిళకు మెరుగైన వైద్యం అందించామని, కాగ తీవ్ర రక్తస్రావం కావడం వల్లనే ఆమె మరణించిందని వారికి సర్ధిచెప్పారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని వారికి చెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు టిడిపి కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, జనసేన పార్టీ నాయకులు సురేష్, సంతోష్, వెంకటేష్, సిపిఐ నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

చేనేతలకు సముచిత స్థానం కల్పించాలి

ఆలిండియా వీవర్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్

సమావేశంలో పాల్గొన్న చేనేత కులస్తులు... మాట్లాడుతున్న బండారు ఆనంద్ ప్రసాద్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాజకీయ పార్టీలు చేనేతలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వకుండా అనగదొక్కే సంస్కృతిని విడనాడి ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించాలని చేనేత జాతీయ అధ్యక్షులు బండారు ఆనంద్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ధర్మవరం పట్టణంలోని శమీనారాయణస్వామి దేవాలయంలో చేనేత కులస్తుల ఐక్యవేదిక రౌండ్‌టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఆనంద్ ప్రసాద్‌తో పాటు రాష్ట్ర చేనేత అధ్యక్షులు ఇనమాల శివరాం ప్రసాద్, ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కోడిపల్లి రాజీ, మాజీ పార్లమెంట్ సభ్యులు నిమ్మల కిష్టప్ప, రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెవి.శేషయ్య తదితరులు హాజరయ్యారు. ముందుగా కదిరి గేటు వద్దగల చేనేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి బైకుర్యాలీ నిర్వహిస్తూ సమావేశం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ ప్రసాద్ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు నేర్పిన చేనేత కులస్తులకు శాసనసభలో ఒక్కరికి కూడా అవకాశం లేకపోవడం సామాజిక రుగ్మతగా భావిస్తున్నామన్నారు. కేంద్రం, రాష్ట్రంలో చేనేతజౌళి శాఖను సైతం నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా చేనేతలను గుర్తించకుంటే రానున్న ఎన్నికలలో తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. చేనేతలను విస్మరిస్తే రాజకీయ పార్టీలను బహిష్కరిస్తామన్నారు. మహిళా నాయకురాలు జయశ్రీ మాట్లాడుతూ చేనేతలంతా ఐకమత్యంతో ముందుకెళ్లాలన్నారు. ధర్మవరం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలు ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఎక్కువ శాతం అగ్రకులాల వారే ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారని చెప్పారు. చేనేతల ఓటు బ్యాంకు ఎక్కువగా ఉన్న వారికి ఇక్కడ అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక నాయకులు రాష్ట్ర హస్తకళ కార్పొరేషన్ బడిగింజలు చంద్రమౌళి, రాష్ట్ర దేవాంగ అధ్యక్షులు డికె.నాగరాజు, రాష్ట్ర తొగట వీరక్షత్రియ మహిళా అధ్యక్షురాలు సురుగు శ్రీలత, నాయకులు చింతా శ్రీనివాసులు, కదిరి నాగరాజు, బొమ్మశెట్టి కృష్ణమూర్తి, డిజి.ఆదినారాయణ, చందా రాము, ధర్మవరం చేనేత నాయకులు గిర్రాజు రవి, బండారు ఆదినారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గడ్డం పార్థసారధి, ఉడుముల రాము, పోలా వెంకటనారాయణ, పరిసే సుధాకర్, గిర్రాజు నగేష్, మెటికల కుళ్లాయప్ప, జింక రాజేంద్రప్రసాద్, అజయ్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ కాలువల ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-మడకశిర

మండల పరిధిలోని అమిదాలగొంది పంచాయతీ గ్రామాల్లో డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచి గీతాఅంజనమూర్తి తెలిపారు. పంచాయతీ పరిధిలోని చాలా గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేక వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రధానంగా దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడేవారు. ఈ తరుణంలో సర్పంచి శనివారం ఎఆర్ రొప్పం గ్రామంలో డ్రెయినేజీ కాలువల ఏర్పాటు పనులకు భూమిపూజ చేశారు. సర్పంచి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, ఇబ్బందుల దృష్ట్యా డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటి ఏర్పాటు వల్ల నివాసాల వద్ద పారిశుధ్యం మెరుగు అవుతుందన్నారు.

వైఫల్యాలను ఎత్తిచూపుతాం

20 ఏళ్లుగా ప్రజలతోనే ఉన్నా.. : కందికుంట

తమ హయాంలో చేసిన అభివృద్ధి చూపుతూ సెల్ఫీఛాలెంజ్ విసురుతున్న కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

వైసిపి అధికారంలోకి వచ్చిన అన్ని రంగాల్లోనూ అభివృద్ధి కుంటుబడిందని, కదిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే వైఫల్యాలను తాము ఎత్తిచూపుతామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో కందికుంట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివద్ధిని చూపుతూ ఆయన సెల్ఫీ ఛాలెంజ్ విసురుతున్నారు. ఇందులో భాగంగా శనివారం నాడు కూడా ఆయన సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ప్రజా జీవితంలోనే తాను ఉన్నానన్నారు. గెలిచినా, ఓడినా స్వార్థ రాజకీయ నాయకుల్లాగా తాను మారలేదన్నారు. ప్రజల కోసం ప్రజల పక్షాన నిలబడుతూ నిరంతరం పోరాడుతున్నానని తెలిపారు. ఈ విషయాన్ని ప్రస్తుత కదిరి ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలని సూచించారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా తన వంతుగా ప్రజలకు మంచి చేయాలని ఆలోచనతో సొంత నిధులతో మైనార్టీల కోసం షాదీమహల్, హిందువుల కోసం శివాలయంలో కళ్యాణ మండపం, క్రిస్టియన్ల కోసం రూ.10 లక్షలు వెచ్చించి కమ్యూనిటీ హాల్ నిర్మించామని గుర్తుచేశారు. గత టిడిపి హయాంలో పలు అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే అబద్దాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు చేస్తున్నారన్నారు. వైసిపి నాయకులు గ్లోబల్ ప్రచారం చేస్తూ రాజకీయం చేస్తున్నారనే విషయాన్ని ప్రజలు కూడా గుర్తిస్తున్నారన్నారు. భవిష్యత్తులోనూ తాను చేసిన అభివద్ధిని చూపుతూ వైసిపి వైఫల్యాలను ఎత్తిచూపుతూనే ఉంటానన్నారు.

చిరువ్యాపారులపై సుంకంబాదుడు

పుట్టపర్తిలో జోరందుకున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు

ఫుట్ పాత్ వ్యాపారాలు వద్ద గుమి కూడిన కొనుగోలుదారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి 98వ జయంతి వేడుకల సందర్భంగా పట్టణంలో విద్యగిరి వద్ద రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్ వ్యాపారాలు వెలిశాయి. గృహ ఉపయోగకర వస్తువులను ఉంచి అమ్మకాలు చేస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రతి ఏటా బాబా జయంతి వేడుకలు ముగిసిన తర్వాత వారం రోజులపాటు గృహ ఉపయోగకర వస్తువులను వివిధ ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు తీసుకొచ్చి పుట్టపర్తిలో వ్యాపారం చేస్తుంటారు. పిల్లలకు సంబంధించిన బ్యాటు, బాళ్లు, విజిల్ వేసే వస్తువులు, బెల్టులు, బ్యాగులు వివిధ రకాల బంతులు, స్వెట్టర్లు, మఫ్లర్లు, అలంకరణ ప్లాస్టిక్ పూలు, పింగాణి కప్పులు, ప్లాస్టిక్ కప్పులు, మగ్గులు, పెనములు తదితర వస్తువులు విక్రయిస్తున్నారు. పుట్టపర్తి పరిసర ప్రాంతాల నుంచి పిల్లలు వాటిని కొనుగోలు చేస్తున్నారు. చిన్న గుడారాలు వేసుకుని ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు రాత్రి సమయంలో వర్షం వచ్చినా తట్టుకుని అక్కడే ఉంటున్నారు. వ్యాపారుల పరిస్థితి ఇలా ఉంటే వీరిపై సుంకాల బాదుడు మరింత అధ్వానంగా ఉంది. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా సుంకం వసూలు చేస్తున్నట్లు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. మామూలుగా ఒక దుకాణానికి రోజుకు 5 రూపాయల సుంకం ఉంటుంది. అలాంటిది ఇక్కడ సుంకం కాంట్రాక్టర్ రూ.100 రూ.200 వసూలు చేస్తున్నట్లు వ్యాపారులు వాపోయారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సుంకం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని చిరువ్యాపారులు కోరుతున్నారు.

ప్రజల సంక్షేమమే వైసిపి ధ్యేయం

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రజల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక నెహ్రూనగర్, ధర్మవరం రోడ్డు, పెనుకొండ రోడ్డు, గాంధీ నగర్‌లలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరి స్తామని తెలిపారు. నాలుగున్నరేళ్లలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చారన్నారు. అర్హులంద రికీ సంక్షేమ పథకాలు అందించామని, గ్రామాల్లో సచివాలయాలు నెలకొల్పి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, విద్య, వైద్యం సదుపాయాలను మెరుగుపరిచామన్నారు. కావున మరోమారు వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బరాన్‌సాబ్, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, విద్యుత్ ఎఇ వెంకటేష్ నాయక్, జెఇ ఓబులేసు, మేజర్ పంచాయతీ కార్యదర్శి గోపాల్, సర్పంచి రాధానాగరాజు, వైసిపి మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, నాయకులు రెడ్డప్పరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఎల్లప్ప, భాస్కర్, షాజహాన్, వైస్ ఎంపిపి సరళ, కృష్ణమూర్తి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అరోమా హాస్పిటల్ ప్రారంభం

అరోమాఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

గోరంట్ల : పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ కు వెళ్లే దారిలో నూతనంగా ఏర్పాటు చేసిన అరోమా హెల్త్ కేర్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, జనసేన పార్టీ నాయకులు సురేష్, కేశవరెడ్డి హాజరయ్యారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ అరోమా హెల్త్ కేర్ సెంటర్‌లో చెవి, ముక్కు, కంటి వైద్యం చేస్తారన్నారు. అనుభవజ్ఞులైన వైద్యుల చేత ఆయుర్వేద వైద్యం కూడా అందిస్తామన్నారు. కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేస్తామని, కళ్లద్దాలు అందుబాటులో ఉంచామన్నారు. ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల్యవివాహాలు, వరకట్నంపై అవగాహన

కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్.ప్రతిమ

గాండ్లపెంట : వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిధిలోని చామలగొంది పంచాయతీలో మండల న్యాయ సేవ సాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కదిరి న్యాయమూర్తి ఎస్.ప్రతిమ హాజరై మాట్లాడారు. ప్రజలకు బాల్యవివాహాలు, వరకట్నంపై అవగాహన కల్పించారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లలు చదివించుకుంటేనే వారికి భవిష్యత్తు ఉంటుందన్నా రు. సదస్సులో రెడ్ సంస్థ బానుజా, న్యాయవాది నరసింహులు, ఎల్లప్ప, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గంగరత్నమ్మ, హెచ్‌ఎం రాజశేఖర్, జమేదార్ రామయ్య, సర్పంచి శివప్పనాయుడు, పోలీసులు, గ్రామ పెద్దలు వైవి.శంకరనాయుడు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాలు ప్రజలకు వరం

కంటి వైద్య శిబిరంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

మడకశిర : ఉచిత కంటి వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు చేస్తామని సిడబ్ల్యూసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. పట్టణంలోని సాయిబాబా దేవాలయ ఆవరణలో శనివారం శారదాంబ సంఘం, వివేకానంద సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి రఘువీరారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది కంటి చూపు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారు డబ్బులు పెట్టి వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇలాంటి ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వారికి ఓ వరమని తెలిపారు. ఆయన కళ్లను పరీక్షించుకున్నారు.

సంచార వైద్యశాలను సద్వినియోగం చేసుకోండి

గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న సంచార వైద్యశాలలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలోని షిరిడీ సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో పావగడకు చెందిన కంటి ఆసుపత్రి యజమాని జపానందస్వామి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ చంద్రశేఖర్, డాక్టర్ రవిశంకర్, వేణుగోపాల్, టిడిపి పట్టణ అధ్యక్షుడు మనోహర్, అశ్వత్థరామప్ప, బేగార్లపల్లి రవికుమార్, మంజు, నారాయణరెడ్డి, చిన్నప్ప, చిక్కన్న, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి కనబరచాలి

ప్రిన్సిపల్ మక్బుల్ హుస్సేన్

బుక్కపట్నం : క్రీడాకారులు క్రీడల పట్ల ఆసక్తి కనపరిచి గెలుపు దిశగా ప్రయత్నించాలని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బుల్ హుస్సేన్, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్యగౌడ్ తెలిపారు. ఎస్కే యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ ఎలైట్ గ్రూపు వాలీబాల్ పోటీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలవడంతో శనివారం అభినందన సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలతో పాటు చదువులో రాణించి కాలేజీకి గుర్తింపు తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు కెంపరాజు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు, సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిడి వినయ్‌కుమార్, అధ్యాపకులు వెంకటేశ్వరప్రసాద్, ఓబులేసు, దస్తగిరి, గంగరాజు, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వరినాట్లు వేసి టిడిపి నిరసన

బుక్కపట్నం : స్థానిక బైపాస్ రోడ్డు గుంతలమయంగా మారి నీరు నిలవడంతో శనివారం టిడిపి ఆధ్వర్యంలో రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయన్నారు. స్థానిక బైపాస్ రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు పడినా స్పందించేవారే లేరని విమర్శించారు. రోడ్లపై గుంతలు పూడ్చలేని దౌర్భాగ పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. ఈ రహదారులపై ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ నరకయాతన అనుభవిస్తున్నారని విమర్శించారు.

వరి నాట్లు వేస్తున్న టీడీపీ నాయకులు

ప్రణాళికలు సకాలంలో పూర్తి చేయాలి

అసిస్టెంట్ ప్లానింగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ సత్యనారాయణ

ఎంఇఒలు, హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కల్పించే వసతులు, పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం రూపొందించే ప్రణాళికలను గడువు లోపు పూర్తి చేయాలని అసిస్టెంట్ ప్లానింగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాలలు, కెజిబివిలను శనివారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కమిటీలు, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు, సర్పంచి, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామసభలు నిర్వహించి ప్రణాళికలు రూపొందించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. అలాగే అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అదనపు గదులకు అవసరమైన నివేదికలు పంపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అలెస్కో ఆనంద్ బాబు, సిఎంఒ అబ్దుల్ మాలిక్, ఎంఇఒలు రమణప్ప, కిరణ్మయి, క్లస్టర్ హెచ్‌ఎంలు రాఘవ, రామకృష్ణారెడ్డి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ భారతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ అబిదాబి, అకౌంటెంట్ అనిత, సిఆర్పిలు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

ఎంపిడిఒ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక కొత్తపల్లి క్రాస్, క్రీస్తు జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, తదితర ప్రధాన కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిపిఎం మండల కమిటీ సభ్యులు వెంకటేష్ అధ్యక్షతన ఎంపిడిఒ వెంకటేశ్వర రావుకు వినతి పత్రం అందజేశారు. పెద్దన్న మాట్లాడుతూ సోమందేపల్లిలో వివిధ కూడళ్లు నిత్యం వాహనాల రాకపోకలు, ప్రజలతో రద్దీగా ఉంటాయన్నారు. ప్రధానంగా క్రీస్తు జ్యోతి స్కూల్ వద్ద ప్రమాదాలు జరగేందుకు ఎక్కువ అవకాశం ఉందన్నారు. కావున ప్రమాదాలను నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎంపిడిఒ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత తొందరగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గంగరాజు, కొండా వెంక టేష్, శ్రీకాంత్, ఈడిగ నాగరాజు, మగ్గాల రామాంజి, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బెస్త క్రిష్ణప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, చేనేత కార్మికులు సంజీవప్ప, కుమ్మరి కిష్టప్ప, కంచి శ్రీనివాసులు, కెవిపిఎస్ మండల నాయకుడు గోవిందప్ప, నజీర్, లక్కోరి వెంకటేశులు పాల్గొన్నారు.

ఘనంగా వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం

హ్యారీ క్రోబక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

లేపాక్షి : మండల పరిధిలోని కొండూరు జడ్పి హైస్కూల్‌లో శనివారం వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయా మ విద్యా పితామహుడు హ్యారీ క్రోబక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతిథులు మాట్లాడుతూ హ్యారీ క్రోబక్ భారతదేశంలో క్రీడల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన జయంతి రోజును వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషగిరిబాబు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శివకుమార్, ఉపాధ్యా యులు గోపి, ప్రసాద్, అనిల్, అశోక్, జగదీశ్, శ్రీనివాసరావు, శంకర్, బద్రి, విశ్వనాథ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాటజూదరులు అరెస్ట్

బత్తలపల్లి : తాడిమర్రి మండల పరిధిలోని పుల్లఓబయ్యపల్లి గ్రామ శివారులో శనివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.7,260, 5 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, రమేష్, అనిల్ పాల్గొన్నారు.

కర్నాటక మద్యం విక్రేత అరెస్టు

లేపాక్షి : మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లి క్రాస్ వద్ద గొంగిటిపల్లి గ్రామానికి చెందిన సోమశేఖర్ కర్నాటక మద్యం అమ్ముతుండగా శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. అతడి నుంచి 85 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలో కర్నాటక మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

టిడిపి నేత మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం

మడకశిర : మండల పరిధిలోని అమిదాలగొంది పంచాయతీ ఎగువ రామగిరి గ్రామనికి చెందిన టిడిపి సీనియర్ నేత సిద్ధప్ప కుమారుడు ఎంజేరప్ప శనివారం మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆయన ఇంటికెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఈశ్వరప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, టిడి పల్లి మంజునాథ్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, నాగరాజు, నరసింహమూర్తి, గోపాల్‌రెడ్డి, మల్లేష్, అంజి ఉన్నారు.

వాలీబాల్ రన్నర్స్‌గా మంగళకర కళాశాల జట్టు

పుట్టపర్తి రూరల్ : ఇటీవల అనంతపురంలో జరిగిన ఎస్కేయూ అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో మంగళకర కళాశాల జట్టు రన్నర్స్‌గా నిలిచింది. గ్రూప్-సి క్రీడా పోటీల్లో ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరిగిన పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 18 జట్లు పాల్గొన్నాయి. రన్నర్స్‌గా నిలిచిన మంగళకర కళాశాల విద్యార్థులను ప్రిన్సిపల్ రమేష్ బాబు, ఎఒ జయచంద్రారెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పోటీ పరీక్షలపై దృష్టి సారించాలి : ఎంఇఒ

హిందూపురం : విద్యార్థులు పోటీ పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఇఒ గంగప్ప సూచించారు. పట్టణంలోని ఇఖ్రా పాఠశాలలో శనివారం ఎఎంపి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష పేపర్లను ఎంఇఒ విడుదల చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షల్లో 8, 9, 10 తరగతులతో పాటు ఇంటర్, డిగ్రీ విద్యార్థులు పోటీ పడతారన్నారు. ఇందులో ప్రతిభ కనబరచిన వారికి స్కాలర్‌షిప్‌తో పాటు ప్రతిభా అవార్డు, నగదు ఇస్తామని తెలిపారు. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 513 మంది హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్, కరస్పాండెంట్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన రైతు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని చైతన్య మండల సమాఖ్య ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల శిక్షణ తరగతులు శనివారం నాటితో ముగిసినట్లు ఏరియా కోఆర్డినేటర్ ఎస్ఆర్ నాగరాజు తెలిపారు. చైతన్య మండల సమాఖ్య మడకశిర ఎంఎస్‌లో ఈసీ సమావేశానికి విఒ లీడర్‌తో పాటు, ఎఫ్‌పిజి సంఘం లీడర్ హాజరయ్యారు. ఉదయమే జెండర్ ర్యాలీ నిర్వహించారు. తర్వాత ఈసీ సమావేశంతో పాటు ఎఫ్‌పిజి సంఘం లీడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎలెసి సిసి లక్ష్మీకాంత, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

సోమందేపల్లి : స్థానిక సాయినగర్, జగ్జీవన్‌రామ్‌నగర్, అంబేద్కర్‌నగర్‌లలో శనివారం మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రంతో పొగ వెదజల్లారు. వారు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ఎటు చూసినా అధికంగా దోమలు ఉత్పత్తి అవుతున్నాయని, దీంతో ప్రజల ఆరోగ్యం రీత్యా పంచాయతీలోని అన్ని కాలనీల్లో మూడు రోజుల పాటు ఫాగింగ్ చేస్తామని తెలిపారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని యుటిఎఫ్ కదిరి పట్టణ, రూరల్ కమిటీల కొత్త అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. స్థానిక ఎన్జీవో హోంలో శనివారం యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. పట్టణ గౌరవాధ్యక్షులుగా ఎస్.షమీంబాను, అధ్యక్షులుగా సి.మధుసూదన్, ఉపాధ్యక్షులుగా టి.ఫయాజ్, గౌసియా బేగం, ప్రధాన కార్యదర్శిగా ఎస్.భార్గవ, కోశాధికారిగా టి.అనిల్, జిల్లా మహాసభ ప్రతినిధులు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. కదిరి గ్రామీణ మండల కమిటీ గౌరవాధ్యక్షులుగా కెఎండి హనీఫ్, అధ్యక్షులుగా జె.నాగరాజు, సహా అధ్యక్షులుగా కె.బాబాఫకృద్దీన్, వి.వింధ్యరాణి, ప్రధాన కార్యదర్శిగా బి.బ్రహ్మేంద్ర, కోశాధికారిగా రాంప్రసాద్ నాయక్ , జిల్లా మహాసభ ప్రతినిధు లు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా సుబ్బారెడ్డి వ్యవహరించారు. ఎం.ఆజాంబాషా పర్యవేక్షించారు.

'చలో విజయవాడ' కరపత్రాలు విడుదల

కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

దేశవ్యాప్త కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాల పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాకు కదిలిరావాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి జెవి.రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సిపిఎం కార్యాలయంలో 'చలో విజయవాడ' కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్త కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాల పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాకు కదిలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, పట్టణ కార్యదర్శి నాగార్జున, రైతు సంఘం మండల అధ్యక్షుడు మారుతి, సిఐటియు నాయకులు ఎల్.ఆదినారాయణ పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని కాపాడుకుందాం'

ధర్మవరం టౌన్ : రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. జన విజ్ఞాన వేదిక, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సంయుక్తంగా శనివారం కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ రాజ్యాంగం విలువలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక చట్టాలు చేసినప్పుడు వాటి రద్దుకు శాంతియుతంగా పోరాటం చేయాలన్నారు. పాలకులు చేసే చట్టాలు కూడా రాజ్యాంగబద్ధమై ఉండాలన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని చదవడం ద్వారా పాలకులను ప్రశ్నించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ భార్గవి, అధ్యాపకులు గోపాల్‌నాయక్, ఎస్ఎస్ఐ రాష్ట్ర నాయకులు నాగార్జున, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలయ్య గెలుపును ఎవరూ అడ్డుకోలేరు :టిడిపి

హిందూపురం : రాబోయే ఎన్నికల్లో పురంలో బాలయ్య గెలుపును అడ్డుకునే శక్తి వైసిపికి లేదని టిడిపి నాయకుల పేర్కొన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం టిడిపి పట్టణ అధ్యక్షుడు రమేష్‌కుమార్, నాయకులు అనిల్‌కుమార్, నాగరాజు, అంజనప్ప, రామాంజనమ్మ మాట్లాడుతూ వైసిపి నాయకులకు భూ దందాలు, సెటిల్‌మెంట్‌లు తప్ప మరొకటి తెలీదన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక ఆర్బాటాలే తప్ప అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. రెండేళ్లు గడచినా రైల్వే రోడ్డు అతీగతీ లేదన్నారు. కూరగాయాల మార్కెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. రోడ్లన్నీ గుంతలుగా మారినా, దోమలు పెరిగి అంటు వ్యాధులు ప్రబలుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. చిన్నపాటి వర్షాలకే పట్టణం జలమయం అవుతోందన్నారు. ఆసుపత్రి అధ్వానంగా మారిందన్నారు. అభివృద్ధి విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. సమావేశంలో నాయకులు సతీష్, రఘు, శివశంకర్, నారాయణరెడ్డి, నబి, ఆనంద్, ప్రెస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

హిందూపురం : ప్రజలందరికీ చట్టాలపై అవగాహన ఉండాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ పేర్కొన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్ కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ న్యాయ దినోత్సవ, వరకట్న నిషేధ దినోత్సవ కార్యక్రమంలో ఆయనతో పాటు జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్ పాల్గొన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. వరకట్న దురాచారాన్ని రూపుమాపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎపిపి ఇందాద్, ఎజిపి శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు నారాయణగౌడ్, సుదర్శన్, సిద్ధూ, కృష్ణమూర్తి రవికుమార్, నవేరా, పార్వతి, లోక్ అదాలత్ శారద, హేమావతి, తదితరులు పాల్గొన్నారు.

అండర్-12 సూపర్ లీగ్ క్రికెట్ పోటీలకు కదిరి జట్టు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండవ దశ అండర్-12 క్రికెట్ పోటీల్లో కదిరి జట్టు ధర్మవరం జట్టుపై గెలిచి సూపర్ లీగ్ పోటీలకు అర్హత సాధించినట్లు కోచ్ నజీర్ తెలిపారు. మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. కదిరి బౌలర్లు జాగతి, సునైన్, హుస్నారా చెరో వికెట్ తీశారు. కదిరి జట్టు వికెట్ నష్టపోకుండా 9 ఓవర్లలో లక్ష్యాన్ని సాధించింది. చైత్ర(27), భువన్(32) పరుగులతో అజేయంగా నిలిచారు. కార్యక్రమంలో ఎస్‌టిఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్మిత, పిడి నరసింహాచారి, కోచ్ రాజశేఖర్, పిఇటి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్గో మాసోత్సవాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎపిఎస్ ఆర్టీసీలో గత నెల 26 నుంచి ఈ నెల 25వ తేదీ వరకూ జరిగిన కార్గో మాసోత్సవాలు ముగిశాయి. కదిరి డిపోలోని ఉద్యోగులు భారీ సంఖ్యలో డోర్ డెలివరీలు బుక్ చేసినారు. వారిలో కండక్టర్లు పులి శ్రీనివాసులు-51, బాబాఫకృద్దీన్-52, అత్యధికంగా డ్రైవర్ చంద్రశేఖర్‌రెడ్డి 55 డోర్ డెలివరీలు చేశారు. కదిరి డిపో టార్గెట్‌కు అవసరమైన డోర్ డెలివరీలను కండక్టర్ తోట శ్రీధర్ మొలకలచెరువు నుంచి చేయించినట్లు డిపో మేనేజర్ బి.మైనుద్దీన్ తెలిపారు. మాసోత్సవాల్లో టీచర్ దుర్గం క్రిష్ణవేణి 10 డోర్ డెలివరీలు చేసి ఆర్టీసీ ప్రచారోత్సవాల్లో పాల్గొన్నారు కార్గో సూపర్‌వైజర్ శ్రీనివాసులు కడప జోన్‌లోనే అత్యధిక డోర్ డెలివరీలు చేయించారు. సిబ్బందికి మేనేజర్‌తో పాటు అసిస్టెంట్ మేనేజర్లు హరిమోహన్, హరిత అభినందనలు తెలిపారు.

9న విజయవాడలో డిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-కదిరి టౌన్

డిటిఎఫ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 9వ తేదీ విజయవాడలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు గౌస్ లాజమ్ పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చేపడుతున్న ధర్నాకు ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మౌలాలి, శ్రీనివాసులు, రామకృష్ణ, వీరా, డివిజన్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వేడి



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ వాతావరణమూ వేడెక్కుతోంది. నేతలతోపాటు, కుల సంఘాల్లోనూ కదలిక కనిపిస్తోంది. తమ సామాజిక తరగతులకు ప్రాధాన్యతను కల్పించాలని ఆయా కుల సంఘాలు డిమాండ్లను వినిపిస్తున్నాయి. ఇక రాజకీయ పార్టీల్లోనూ సమీకరణలు రోజురోజుకూ మారుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన టిడిపి, వైసిపిల్లోనూ నేతలు తమ స్థానాలను పదిలం చేసుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ వారంలో జరిగిన రాజకీయ పరిణామాలు చూస్తే ఇదే రుజువు చేస్తున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంకు సంబంధించి పంచాయతీ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు వద్ద జరగడం చర్చనీయాంశమైంది. ఇప్పటి వరకు రాయదుర్గం టిక్కెట్టు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేరే వినిపిస్తూ వచ్చింది. రాయదుర్గం పర్యటన సమయంలోనూ కాలవ శ్రీనివాసులుకే టిక్కెట్టు ఉంటుందని చంద్రబాబు ప్రకటించారు. అయితే ఈ వారంలో చంద్రబాబు వద్దనే రాయదుర్గం నియోజకవర్గంపై దీపక్‌రెడ్డి, పూల నాగరాజులు కలిసి చర్చించడం చర్చనీయాంశమవుతోంది. మార్పు చేయాలని పట్టుబట్టినట్లు రాజకీయవర్గాల్లో చర్చనడుస్తోంది. ఇదే సమయంలో ఇతర నియోజకవర్గాల్లోనూ మార్పులపై అసంతృప్తులు, ఆశావహుల సందడి మొదలైంది. ఇప్పుడున్న వారిని కాదని కొత్తవారికివ్వాలన్న డిమాండ్‌ను తెలుగుదేశం పార్టీలో వినిపిస్తోంది. ఇంకో వైపు కుల సంఘాలు రాజకీయ ప్రాధాన్యత కోసం సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఈ వారంలో కురబ సంఘం భారీ ప్రదర్శనను అనంతపురం నగరంలో చేపట్టింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ కార్యక్రమం జరిగినట్టు చర్చనడుస్తోంది. అయితే నేతలు పార్టీల వారీగా విడిపోయి గోరంట్ల మాధవ్, బికె.పార్థసారథి మధ్య వివాదం చోటు చేసుకోవడం గమనార్హం. అయితే ఆ సామాజిక వర్గానికి సంబంధించిన వారు పెద్దఎత్తున పాల్గొన్నారు. అంతక మునుపు వాల్మీకిలు సభను నిర్వహించారు. పుట్టపర్తిలో వడ్డేర్లు తమకు అవకాశం కల్పించాలన్న డిమాండ్‌ను వినిపిస్తున్నారు. ఇలా అన్ని కుల సంఘాలు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. హిందూపురం ప్రాంతంలో బోయలకు టిడిపికి ప్రాధాన్యత కల్పించాలన్న వాదనలు నేతల వద్ద జరుగుతుండటం గమనార్హం. ఇక వైసిపిలోనూ ఇదే రకమైన రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి. హిందూపురంలో కొత్త నియోజకవర్గ ఇంఛార్జీ దీపికను నియమించినప్పటి నుంచి ఎమ్మెల్సీ ఇక్బాల్ నియోజకవర్గానికి దూరంగా ఉంటూ వచ్చారు. ఇటీవలనే ఆయన నియోజకవర్గానికి వచ్చారు ఈ సమయంలో ఆయన ఘన స్వాగతం లభించింది. సామాజిక బస్సు యాత్రకు మించి జనాలు రావడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇలా ఈ వారంలో రాజకీయంగా కదలిక మొదలైంది. ఇక వామపక్షాలు రైతాంగా సమస్యలపై పోరాటాన్ని సాగిస్తున్నాయి. అనంతపురం జిల్లా కలెక్టరు కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో కరువు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. కరువు లెక్కింపులోనే కోతలు పెట్టడం సరైంది కాదని సిపిఎం చెబుతోంది. ఎకరానికి రూ.40 వేలు పరిహారమివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సిపిఐ కూడా కలెక్టరేట్ ఎదుట ఇదే డిమాండ్లపై నిరసన చేపట్టారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ బ్రిడ్జి కూలడం కూడా ఈ వారంలో ప్రధాన అంశంగా ముందుకొచ్చింది.

స్త్రీ హింసను నిర్మూలించాలి

అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవంలో వక్తలు

గుడిబండలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్త్రీ హింస నిర్మూలణకు ప్రతిఒక్కరూ ముందడుగు వేయాలని ఎంపిడిఒ సాయిమనోహర్, ఎస్ఐ శ్రీనివాసులు, ఆర్‌డిటి ఎటిఎల్ రుక్మాంగధ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌కె ఫంక్షన్ హాలులో శనివారం సోషల్ కమిటీ సభ్యులు గంగాధర్, రాధమ్మ, ఎఎన్ఎం రాధ, లతమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఎంపిడిఒ, ఎస్ఐ, ఎటిఎల్ మాట్లాడుతూ ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి చనిపోయేంత వరకూ హింసకు గురవుతుందని, అందుకు బాల్యవివాహాలు, నిరక్షరాస్యత, మద్యం, జూదం వంటివి కారణాలు అన్నారు. కుటుంబం నుంచే ఈ వ్యవస్థను నిర్మూలించాల న్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. దిశ యాప్, తదితర చట్టాల గురించి వివరించారు. హింసకు వ్యతిరేకంగా, ఎవరినీ హింసించమంటూ ప్రతిజ్ఞ చేయించారు. పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మల్లకుంట నారాయణమ్మ, కౌన్సిలర్ శోభారాణి, ఎఎన్ఎం ఆశా, ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, ఇంజినీర్ ఈశ్వరయ్య, సిఐలు వెంకటేష్, నాగరాజు, తిమ్మరాజు, మంజునాథ్, శివాజీ, మహిళా సంఘాల సభ్యులు, ఆర్‌డిటి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మహిళలు గృహహింసకు గురికాకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఇఒ జయచంద్ర, ఆర్‌డిటి ఎటిఎల్ సుధాకర్ తెలిపారు. స్థానిక ఆర్‌డిటి కార్యాలయంలో అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల మహిళలు ఆర్‌డిటి అధికారులు, విద్యార్థులతో కలిసి ఆర్‌డిటి కార్యాలయం నుంచి ప్ల కార్డులు చేతపట్టి ర్యాలీగా నాలుగు రోడ్ల కూడలి చేరుకుని మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, స్పోర్ట్స్ మేనేజర్ శ్రీదేవి, నాయకులు వనిత, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గాండ్లపెంట : ఆర్‌డిటి ఆధ్వర్యంలో గాండ్లపెంట, ఎన్‌పి కుంట మండలాల మహిళలు ర్యాలీ నిర్వహించి స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశా నికి ముఖ్య అతిథులుగా ఆర్‌డిటి ఆఫీసర్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ రామానాయక్, ఎస్ఐ ఎ.వెంకట నారాయణ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నవీన్, గంగాధర్, నారాయణ, అనిత పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ఆర్‌డిటి ఏరియా టీం లీడర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌డిటి ఆఫీస్ నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అనంతపురం, బత్తలపల్లి ఆర్‌డిటి అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సిఐ హేతేంద్ర, ఎపిఎం హేమలత, బత్తలపల్లి రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు, ముదిగుబ్బ ఏరియా టీమ్ లీడర్ సంజీవరెడ్డి, సిఐలు, సిబిటిలు, ఆర్‌డిటి సిబ్బంది పాల్గొన్నారు.

గుడిబండ : జెండర్ క్యాంపెయిన్‌లో భాగంగా స్థానిక ఆదర్శ మండల సమైక్య కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అలాగే రాళ్లపల్లి, శంకరగల్లు, మందలపల్లి, జమ్మలబండ, మోరుబాగల్, కెఎన్.పల్లి, కరికెర, తదితర గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు బాల్య వివాహాలు, గృహహింస చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వెలుగు అధికారులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.